క్లుప్తంగా

జీసీ హోమ్ వార్డెన్ మృతికి సంతాపం



నరసన్నపేట: స్థానిక గోఖిలే శిశు సదనం (జీసీ హోమ్) వార్డెన్‌గా పనిచేస్తున్న రవీంద్ర కుమార్ సాహు (81) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినట్లు భార్య లక్ష్మీప్రియ తెలిపారు. జీసీ హోమ్‌ను సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారు 72 ఏళ్ల నిర్వహిస్తున్నారు. రవీంద్రకుమార్ సాహు 50 ఏళ్లుగా వార్డెన్‌గా పనిచేస్తున్నారు. రవీంద్రకుమార్ సాహు మృతి పట్ల లోకల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ సదాశివుని కృష్ణ, ప్రధాన కార్యదర్శి టంకాల గౌతమ్, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

చికెన్ ఫాక్స్ రాకుండా..



హోమియో మందులు వేస్తున్న వైద్యురాలు

సారవకోట: మండలంలోని చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో 106 మంది విద్యార్థులకు బుధవారం చికెన్ ఫాక్స్ (అమ్మవారు) రాకుండా ముందుస్తుగా హోమియో మందులను వైద్యురాలు వై.అనుజ్ఞ పంపిణీ చేశారు. చికెన్ ఫాక్స్ ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎం పాటోజు శ్రీనుబాబు, సిబ్బంది ఉన్నారు.

54 మందికి దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో సాయి డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన వైద్యులు, సిబ్బంది వచ్చి 54 మందికి వివిధ రకాల పరీక్షలు చేపట్టారు. పలువురికి పుప్పు పళ్ల తొలగించారు. మరి కొందరికి పళ్లల్లో ఖాళీలను ఫిల్లింగ్ చేశారు. 12 మందికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. సర్పంచ్ రావాడ మోహన్‌రావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో (బీఆర్‌నగర్ ఫీడర్) మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు పనులు శుక్రవారం చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృషి విజ్ఞాన కేంద్రం, బీఆర్‌నగర్, రైల్వే స్టేషన్, మెయిన్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, వరదావారి క్వార్టర్స్, లక్ష్మీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో (తిలారు ఫీడర్) చెట్ల కొమ్మలు శుక్రవారం తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈ వి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిలారు, టెక్కలిపాడు, రావిపాడు, రావాడపేట, హరిశ్చన్మపేట, సోదాం, దరివాడ, లింగాలవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఛత్రపతి శివాజీ పోరాట యోధుడు



శివాజీ ఆయుధాన్ని (కత్తి) చూపిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: భారత వీరత్వానికి ప్రతీకగా నిలిచిన గొప్ప పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ అని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ స్కూల్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్‌కు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. యూపీ స్కూల్‌గా ఉన్న కృష్ణాపురం పాఠశాలను స్థాయి తగ్గించి ప్రైమరీ స్కూల్‌గా మార్చేశారన్నారు. ఫౌండేషన్ స్కూల్‌గా స్థాయిని తగ్గించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించేలా చూడాలన్నారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అంపోలు యశోదమ్మ, అరుణ్ జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు..

మోక్షమెప్పుడో?

- ఆశగా ఎదురుచూస్తున్న అర్హులు
- కొత్త కార్డుల ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు



రేషన్‌కార్డులు

నరసన్నపేట నియోజకవర్గంలో రేషన్ కార్డుల వివరాలు

మండలం	మొత్తం రేషన్ కార్డులు	వచ్చిన రిక్వెస్ట్‌లు
నరసన్నపేట	23,354	4,618
పోలాకి	21,265	3,769
సారవకోట	16,441	2,752
జలుమూరు	19,165	3,454

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్నా.. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తగిన ఆదేశాలు చేయకపోవడంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలో వందలాది వేలాది మంది అర్హులు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై అసలు ఆలోచన చేస్తున్నట్లు లేదు. రేషన్ కార్డుల కోసం ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా ఏమీ చేయలేమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఆశగా వెళ్తున్న ప్రజలు నిరసగా వెనుదిరుగుతున్నారు. కార్డుల్లో చేర్పులు, మార్పులకూ అవకాశం ఉండటంలేదు.

హామీలతోనే సరిపెట్టారు..

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను, ప్రజల శ్రేయస్సును పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డులు అనేక సంక్షేమ పథకాల అమలుకు ఎంతో ఆధారం. కార్డులు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం ఇంత జాప్యం చేస్తుండటంతో ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే సేవలు

2019–2024 మధ్య రేషన్‌కార్డుల మంజూరు పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు వచ్చేవి. కొన్ని సందర్భాల్లో గంటల వ్యవధిలో కూడా రేషన్ కార్డులు మంజూరు అయ్యేవి. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా ఎల్లప్పుడూ సచివాలయంలో ప్రభుత్వ సైట్లు అందుబాటులో ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారే స్వయంగా దరఖాస్తు చేసి కార్డు మంజూరైతే ఇంటికి తీసుకువచ్చి లబ్ధిదారులకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి సైట్లన్నీ మూసేశారు. ఇదేమి పాలన అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ పాత రోజులే..

2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అరకొరగా రేషన్ కార్డులను మంజూరు చేసేది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో వారికి నచ్చిన వారికి కార్డులు ఇచ్చేవారు. చాలా మంది అర్హులకు కార్డులు దక్కేవి కాదు. అనేక ప్రభుత్వ పథకాలకు దూరమయ్యేవారు. ప్రస్తుతం మళ్లీ ఆ రోజులే గ్రామాల్లో కనిపిస్తున్నాయి. కొత్త కార్డుల కోసం ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినా మంజూరుపై అర్హులకు నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి.

కొత్త కార్డులు ఎప్పుడిస్తారు



ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతోంది. ఇప్పటివరకు కొత్త కార్డుల ఊసేలేదు. కార్డుల్లో చేర్పులు, మార్పులకూ అవకాశం లేదు. అసలు సైటే ఓపెన్ కావడం లేదు. ప్రజలు సచివాలయల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్త కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు విడుదల చేయాలి.

– బగ్గు జగదీశ్వరి, బొరిగివలస, నరసన్నపేట మండలం

గంటల వ్యవధిలోనే కార్డులు వచ్చేవి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డులు గంటల వ్యవధిలో వచ్చేవి. వలంటీర్లు జల్లెడ పట్టి అర్హులైన వారికి కార్డుల కోసం దరఖాస్తులు చేయించేవారు. ప్రస్తుతం కార్డులు సకాలంలో అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో వందలాది మంది కొత్త కార్డుల కోసం, కార్డుల్లో చేర్పులు, మార్పులు కోసం ఎదురు చూస్తున్నారు.

– యాళ్ల అప్పలనాయుడు, మాకివలస, నరసన్నపేట మండలం

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

ప్రభుత్వం నుంచి కొత్త కార్డులు, కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మార్గదర్శకాలు రావాల్సి ఉంది. త్వరలో వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం.

– రామకృష్ణ, సివిల్ సప్లయ్ డీటీ, నరసన్నపేట

చెరువు ఆక్రమణ అడ్డగింత



చెరువులో మట్టి వేసిన దృశ్యం

నరసన్నపేట: మండలంలోని కంబకాయ గ్రామంలో గల జమ్ము చెరువు ఆక్రమణను రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మట్టితో చెరువులో కొంత స్థలాన్ని కప్పి నిర్మాణానికి ప్రయత్నించారు. గ్రామస్తుల నుంచి తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై వెంటనే తహసీల్దార్ సత్యనారాయణ స్పందించారు. ఆర్‌ఐ సాయి, సర్వేయర్ అప్పలస్వామిని పంపించి పరిస్థితిని తెలుసుకున్నారు. వీఆర్వో, సచివాలయ సర్వేయర్‌లు వచ్చి ఆక్రమణదారుడికి నచ్చజెప్పినా వినలేదు. పోలీసుల జోక్యం చేసుకుని ఆక్రమణను నిలిపివేయించారు. కంబకాయలో సర్వే నంబర్ 148లో జమ్ము చెరువు విస్తీర్ణం 5.36 ఎకరాల్లో ఉంది. చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులను గ్రామస్తులు కోరారు.

హిందీ జాతీయ భాష



హిందీ భాషోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హిందీ భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భాషోత్సవాలు చేపట్టనున్నారు. మండలం సుందరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు ఐ.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం హిందీ భాషోత్సవాలు నిర్వహించారు. హిందీ జాతీయ భాష అని, హిందీపై పట్టు సాధించడం ద్వారా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వృత్తలేఖన, చేతిరాత, చదవడం, రాయడం వంటి పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం సోమన్ రెడ్డి, ఉపాధ్యాయులు తవిటయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలేజ్ ఫెస్ట్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ఫెస్ట్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంబంధ, సారస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణ రావు తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కష్టపడి చదవకూడదని, ఇష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ యు.వి.ఎస్.వర్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.పోలినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామారావు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పైడితల్లి, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండకు మాజీ సీఎం జగన్ రాక నేడు



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గురువారం పాలకొండలో పర్యటించనున్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల అనారోగ్యంతో పాలవలస రాజశేఖరం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. పాలకొండలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు మధ్యాహ్నం 1 గంటకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

తరలిరండి..



ఏవీ సురేష్

హిరమండలం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం పాలకొండలో చేపట్టనున్న పర్యటనను విజవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ అధినేతకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘన స్వాగతం పలకాలి..



ఖండాపు గోవిందరావు

బూర్జ: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం పాలకొండలో ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పాలకొండలో గల యాలాం జంక్షన్‌కు మధ్యాహ్నం 1 గంటకు చేరుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా..

ఘనంగా ఆలయం వార్షికోత్సవం



శివలింగాకారంలో అమర్చిన కలశాలు

పొందూరు: స్థానిక అయ్యప్పస్వామి సహిత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, కుంకుమ, కలశ పూజలు చేశారు. ఆలయం బయట శివలింగాకారంలో కలశాలను ఏర్పాటు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వేలాదిమంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

కొత్తూరు: భూ సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తప్పవని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుండా తప్పుగా నమోదు చేస్తే సహించేది లేదన్నారు. ఆకులతంపర వీఆర్వో దరఖాస్తులను సక్రమంగా పరిశీలించకపోవడంతోపాటు తప్పుడు సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి తప్పులు నమోదు చేస్తే విధుల నుంచి సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. తహసీల్దార్ కృష్ణమూర్తి, డీటీ నారాయణరావు పాల్గొన్నారు.

విజయగౌరీకి మద్దతుగా నిలవాలి



పొందూరు: పొందూరులో ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్, పీడీఎఫ్ నాయకులు

పొందూరు రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరీకి మద్దతుగా నిలవాలని యూటీఎఫ్, పీడీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. మండలంలోని కింతలి, కనిమెట్ట, పొందూరు, లోలుగు, గోకర్నపల్లి, దళ్లవలస తదితర గ్రామాల్లో బుధవారం ప్రచారం చేశారు. పొందూరు అప్పారావు, బూరాడ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, అన్నంనాయుడు, రాజు పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరీ కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకుడు సిర్ల ప్రసాదరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

హిరమండలం: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు కె.రాంబాబు,బి.గొల్లవాడు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య జ్ఞానజ్యోతి (ఈసీసీఈ) విధానాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం టి.కేశవరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రిసోర్స్ పర్సన్లు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులను సక్రమంగా తీర్చిదిద్దాలి

సరుబుజ్జిలి: అంగన్‌వాడీల కేంద్రాల చిన్నారులకు ఆహ్లాదం కలిగించే రీతిలో వివిధ రకాల అంశాలను బోధించాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ పేడాడ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఎంఈఓలు డి.బాలరాజు, కె.శ్రీనివాసరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, రిసోర్స్‌పర్సన్లు బాలమురళి, మన్మథరావు, రాము, సీఆర్పీలు చిరంజీవి, బెండి చిన్నారావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను ప్రేమగా ఆదరించాలి

ఆమదాలవలస: అంగన్‌వాడీ కేంద్రాల్లో గల చిన్నారులను ప్రేమగా ఆదరించి బోధించాలని ఆమదాలవలస ఎంఈఓ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ పీఓ అనూరాధ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు అందించారు. సృజనాత్మకత వంటి అంశాలపై అవగాహన, కృత్యాధార ప్రదర్శన విషయాలు ప్రాక్టికల్‌గా వివరించారు.

అధ్వానం..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని బుడ్డివలసకు వెళ్లే సుమారు కిలో మీటరు మేర పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా రాళ్లుతేలి ఉంది. నడిచేందుకు కూడా ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో రహదారి మొత్తం చదును చేసి గ్రావెల్ వేశారు. అక్కడ నుంచి రహదారి పనులు ముందుకు సాగలేదు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు గ్రామంలోకి వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

వైద్య శిబిరం



హిరమండలం మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో 104 సంచార వాహనం ద్వారా 52 మందికి హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బుధవారం పలు గూడల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఈసీజీ, బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

– హిరమండలం

తనిఖీ



మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సర్వశిక్ష అభియాన్ జీసీడీఓ ఎస్.నీరజ అన్నారు. హిరమండలం కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. ఇప్పటినుంచే ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. రికార్డులు, హాజరు పట్టీకలను పరిశీలించారు. ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి ఉన్నారు.

– హిరమండలం

పరిశీలన



మెళియాపుట్టి మండలం ముకుందాపురంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న రాతికట్ట పనులను ఈసీ ఆదినారాయణ రెడ్డి బుధవారం పరిశీలించారు. రాతికట్టలు కట్టడం ద్వారా కొండవాలు ప్రాంతం నుంచి వచ్చిన వర్షం నీరు గిరిజన రైతులకు చెందిన జీడిమామిడి తోటలకు ఉపయోగపడుతుందన్నారు. రాతికట్టల నిర్మాణ పనులు చేస్తున్న వేతనదారులు నిర్దిష్ట వేతనాలు పొందుతున్నారన్నారు. గిరిజన రైతులు రాతికట్టల పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రసహాయకుడు తిరుపతిరావు ఉన్నారు.

– మెళియాపుట్టి

ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు



ఆనందరావు, నాగేంద్రను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కొత్తూరు: కూటమి ప్రభుత్వం అవలింబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా గండివలస ఆనందరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా గంధవరపు నాగేంద్రను ఇటీవల పార్టీ నియమించింది. వీరిద్దరిని మెట్టూరులో బుధవారం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సర్పంచ్‌లు ధర్మరావు, నక్క వెంకటరావు, నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యులు వనుము లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ కృష్ణారావు, బోర ఆఫీస్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, తమ్మినాయుడు, కృష్ణమోహన్, లింగం, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు పనులు కల్పించటంతోపాటు ఇంకుడు గుంతల నిర్మాణంలోనూ లక్ష్యాలను చేరుకోవాలని ఏపీఓ వి.శ్రీదేవి సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి మార్చి ఆఖరు నాటికి వంద రోజులు పని కల్పించాలన్నారు. సాంకేతిక, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.